సాక్షి
కుమురం భీం
గురువారం, 13 మార్చి, 2025



'సహజ' హోలీ.. సంతోషాల కేళి

ఆదివాసీలు హోలీ పండుగను ప్రత్యేకంగా జరుపుకొంటారు. మోదుగుపూలతో తయారు చేసిన రంగులతో రంగోలి ఆడడం ఆనవాయితీగా వస్తోంది. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురువారం : 6:21	శుక్రవారం : 5:09

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.1 /23.1

ఉష్ణోగ్రతలు మరింత పెరిగి మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఉంటుంది. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది. తెల్లవారుజామున చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ డిపో మేనేజర్ బదిలీ

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న విశ్వనాథ్‌ను బోధన్ డిపోకు బదిలీ చేస్తున్నట్లు సంస్థ ఎండీ సజ్జనార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో పని చేస్తూ పదోన్నతి పొందిన రాజేశ్వర్‌ను ఆసిఫాబాద్ డీఎంగా నియమించారు. కాగా, కొంతకాలంగా ఆర్టీసీ డ్రైవర్లను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు వేధింపులకు పాల్పడుతుండటంతోనే డీఎం విశ్వనాథ్‌ను బదిలీ చేశారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏఐటీయూసీ చేసిన పోరాటంతో రెండు రోజుల క్రితం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు తెలిపారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ



విద్యార్థులతో డీఎంహెచ్‌వో సీతారాం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బుధవారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో సీతారాం మాట్లాడుతూ జిల్లాలో 931 మంది విద్యార్థులు దృష్టి లోపంతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఇందులో తొలి విడతలో 471 మందికి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే వైద్యుడు నరేందర్ పాల్గొన్నారు.

సైన్స్‌తో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం



ప్రయోగాలు పరిశీలిస్తున్న విద్యార్థులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): సైన్స్‌తో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ అన్నారు. మండలంలోని చేడ్వాయి ఉన్నత పాఠశాలలో బుధవారం మొబైల్ సైన్స్ ల్యాబ్ ద్వారా పలు ప్రయోగాలు చేశారు. ఆయన మాట్లాడుతూ సైన్స్ ప్రయోగాలు చేయడం ద్వారా విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం కలుగుతుందన్నారు. పరిశోధన శక్తి పెరిగి నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రమేశ్‌బాబు, ఉపాధ్యాయులు రాకేశ్, సుమిత, రాజ్‌కమలాకర్‌రెడ్డి, శిల్ప, స్వప్న పాల్గొన్నారు.

కూలీలకు వంద పనిదినాలు కల్పించాలి



మాట్లాడుతున్న డీపీవో భిక్షపతిగౌడ్

పెంచికల్‌పేట్(ఆసిఫాబాద్): ఉపాధిహామీ పథకంలో కూలీలకు వంద పనిదినాలు కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి పనిదినాలు కల్పించాలన్నారు. పనులను ముందుగా గుర్తించి సుమారు వంద మంది కూలీలు పనిచేసేలా ప్రోత్సహించాలని సూచించారు. పంచాయతీల్లోని నర్సరీలను ప్రతిరోజూ సందర్శించి మొక్కల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వందశాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో అల్బర్ట్ తదితరులు ఉన్నారు.



కౌటాల మండలం తాటిపల్లి వద్ద పెన్‌గంగలో స్నానాలు(ఫైల్)

కావొద్దు.. విషాదం

గతేదాది హోలీ పండుగ కౌటాల మండలంలో విషాదం నింపింది. పండుగ సంబురాల అనంతరం నదికి స్నానానికి వెళ్లిన కౌటాల మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. పండుగ రోజు చేతికందిన కుమారులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ కుటుంబాలు తీరని దుఃఖంలో మునిగిపోయాయి.. పండుగ సమయంలో ఏమరుపాటుగా ఉంటే జరిగే ప్రమాదాలకు ఈ ఘటన నిదర్శనం.. ఈ నెల 14న హోలీ పండుగ సందర్భంగా ప్రత్యేక కథనం.

- జిల్లావ్యాప్తంగా రేపు హోలీ సంబురాలు
- వాగులు, నదుల వద్ద స్నానాలు
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదాలకు ఆస్కారం

చింతలమానెపల్లి(సిర్పూర్): చిన్నాపెద్ద, కుల, మత బేధం లేకుండా హోలీ పండుగను అంతా కలిసి ఉల్లాసంగా జరుపుకొంటారు. సామూహికంగా జరుపుకునే ఈ పండుగకు క్రేజ్ ఎక్కువే. రంగులు చల్లుకుంటూ విందులు, వినోదాలతో సంతోషంగా గడపుతుంటారు. జిల్లావ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో పౌర్ణమి సందర్భంగా రెండు రోజుల పాటు హోలీ నిర్వహించుకుంటారు. విభిన్న ఆచారాలు ఉన్నప్పటికీ హోలీ పండుగ కొత్త అలవాట్లకు వేదికగా మారుతుంది. సంబురాల అనంతరం యువత ఎక్కువగా స్నానాలకు వెళ్తుంటారు. జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో నదులు, వాగులు, చెరువులు, కుంటలు, నీటిప్రాజెక్టులు అందుబాటులో ఉన్నాయి. రంగులు చల్లుకున్న అనంతరం స్నానాలకు వెళ్లడం సర్వసాధారణం. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో వట్టివాగు, అడ ప్రాజెక్టు, పెద్దవాగుకు స్నానాలకు వెళ్తుంటారు. కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాల ప్రజలు సమీపంలోని పెద్దవాగు, ప్రాజెక్టులు, సిర్పూర్(టి), కౌటాల మండలాల్లో పెన్‌గంగ నది వద్దకు, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల వాసులు ప్రాణహిత నదికి స్నానాలకు వెళ్తుంటారు.

నిత్యం నీటి ప్రవాహం

జిల్లాలోని జీవనదులైన పెద్దవాగు, ప్రాణహిత, పెన్‌గంగ నదుల్లో ఏడాదంతా నీటి ప్రవాహం కొనసాగుతోంది. అడ, వట్టివాగు ప్రాజెక్టుల్లో నిత్యం జలకళ ఉంటుంది. సమీపంలోని గ్రామాల్లోని ప్రజలు పండుగ వేళల్లో స్నానాలకు నీటి వనరుల వద్దకు వెళ్లడం సాధారణ విషయం. పెద్దవాగు, ప్రాణహిత, పెన్‌గంగ నదుల్లో పలుచోట్ల ప్రమాదకర మడుగులు, ప్రమాదకర స్థాయిలో నీటిమట్టం ఉంటుంది. హోలీ జరుపుకునే వారు గతంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందే.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..

హోలీ సమయంలో ప్రమాదాలకు ఆస్కారం ఉండటంతో కుటుంబ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లోని చిన్నపిల్లలు, యువకులు ప్రాణాల విలువ గుర్తించే విధంగా అవగాహన కల్పించాలి. ముందస్తుగా హెచ్చరించడం ద్వారా ప్రమాదాల బారినపడకుండా అప్రమత్తంగా ఉంటారు. నదులు, వాగుల వద్ద ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలి. అవసరమైన చోట నీటిమట్టం సూచించే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలి. గతంలో ప్రమాదాలు జరిగిన ప్రదేశాలు, ప్రజల తాకిడి ఎక్కువగా ఉంటే చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి.

మద్యంతో ప్రమాదాలు..

హోలీ వేడుకల్లో మద్యం సేవించడం, విందులు జరుపుకోవడం ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఇవి శృతిమించితే రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. మద్యం తాగి నదులకు స్నానాలకు వెళ్లే టప్పుడు అత్యుత్సాహంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మరోవైపు మార్కెట్‌లో రంగులు ప్రమాదకరంగా ఉంటున్నాయి. రసాయన రంగులు వినియోగించడం ద్వారా ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురవుతాయి. మార్కెట్‌లో ఎక్కువగా కాపర్‌సల్ఫేట్, కాల్షియం క్రోమియం, లిరాక్సైడ్ వంటి రసాయనాలను సాధారణంగా బట్టలకు రంగులు వేయడానికి వినియోగిస్తుంటారు. వీటిని చర్మంపై చల్లుకోవడం ద్వారా చర్మ సంబంధమైన వ్యాధులు, కళ్లలో పడితే కంటి సంబంధిత వ్యాధులు, ముక్కు, నోటిద్వారా శ్వాసనాళాల్లోకి వెళ్లినా, జీర్ణాశయంలోకి వెళ్లినా ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. వీటిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. సహజంగా ప్రకృతి పదార్థాలతో తయారు చేసే రంగులను వినియోగించడం శ్రేయస్కరం.

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా ప్రజలు హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. హోలీ రోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు వేడుకలు ముగించుకోవాలని సూచించారు. ఇష్టపడని వ్యక్తులు, ప్రదేశాలు, వాహనాలపై రంగులు, నీటిని చల్లొద్దన్నారు. నీటి బెలూన్లు, గాజు పొడి కలిపిన రంగులను వాడొద్దన్నారు. మద్యం మత్తులో అల్లర్లు చేయడం నిషేధమని, మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శాంతి భద్రతలకు భంగం కలిగించడం, ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

రుణాల పేరుతో మోసం!

- కాగజ్‌నగర్‌లో రూ.లక్షలు కాజేత
- లబోదిబోమంటున్న బాధిత మహిళలు



రుణాలు ఇస్తామని వచ్చిన ఇద్దరు వ్యక్తులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మహిళలకు సులువుగా రుణాలు ఇస్తామని చెప్పి రూ.లక్షలు వసూళ్లు చేసి మోసం చేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ నెల 7న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ముగ్గురు వ్యక్తులు తాము ఆంధ్రా నుంచి వచ్చామని చెప్పుకుంటూ కాలనీల్లో ఇంటింటికీ తిరిగారు. మహిళలకే రుణాలు అంటూ, ఒక్కొక్కరికి కనీసం రూ.50వేల చొప్పున రుణాలు ఇస్తామని నమ్మించారు. ముందుగా మహిళలు గ్రూప్‌గా ఏర్పాటు చేసుకోవాలంటూ ఒక్కొక్కరి నుంచి రూ.3వేల చొప్పున వసూలు చేశారు. అలా పట్టణంలోని విజయ్ బస్తీ, కోసిని, సర్దార్ బస్తీ, తదితర కాలనీలకు చెందిన మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, గృహిణులు మొత్తం వందమందికి పైగా డబ్బులు కట్టారు. అయితే ఈ నెల 11న డబ్బులు చెల్లించిన వారందరికీ రుణాలు ఇస్తామని చెప్పి వెళ్లిపోయారు. కానీ గత రెండు రోజులుగా రుణాల కోసం మహిళలు కాల్స్ చేస్తే అటు నుంచి ఎవరూ లిఫ్ట్ చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. డబ్బులు కట్టిన మహిళలకు రూ.3వేలు తీసుకుని రూ.వెయ్యి విలువైన టేబుల్ ఫ్యాన్లు అంటగట్టారని వాపోతున్నారు. ఆసిఫాబాద్ పట్టణం జూబ్లీ మార్కెట్‌లో తమ ఆఫీసు ఉందని చెబితే అక్కడికి వెళ్లి చూస్తే ఎలాంటి ఆఫీసు లేదు. ఈ వ్యవహారమంతా చూస్తే మోసపోయినట్లుగా గుర్తించారు. ఇంకా కొత్తగా ఎవరూ కూడా డబ్బులు కట్టడం చేయొద్దని బుధవారం సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఇదంతా చెప్పుకుంటే ఇబ్బందిగా ఉంటుందని ఎవరూ కూడా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వలేదు. మారుమూల ప్రాంతాల్లో ఇంకా బాధితులు ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే రుణాల మోసంపై అందరం కలిసి ఫిర్యాదు చేస్తామని బాధిత మహిళ ఒకరు 'సాక్షి'కి తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



గోయగాం పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని గోయగాం ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. మధ్యాహ్నం భోజనం, హాజరు పట్టికను పరిశీలించారు. పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షల తీరును పర్యవేక్షించారు. విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం మండలంలోని ధనోరా వద్ద ఉన్న మిషన్ భగీరథ పంప్‌హౌస్‌ను సందర్శించారు. ఈఈ రాకేశ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో ఆడే ప్రకాశ్, ఉపాధ్యాయులు, ఏఈలు ఉన్నారు.

'ధరణి' దరఖాస్తులు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వివిధ భూ సమస్యలపై ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల తహసీల్దార్లతో ధరణి(భూభారతి)లో వచ్చిన సమస్యలపై సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి పరిశీలించి, రికార్డులు సరిచూసి దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. ప్రతీ ఫైల్ వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీవో లాగిన్‌లో ఉన్న రికార్డులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై అధికారులు ప్రతిరోజూ సమీక్ష నిర్వహించాలని సూచించారు.

స్త్రీనిధి రుణాలు వందశాతం రికవరీ చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళా సంఘాల అభివృద్ధిలో భాగంగా అందించే స్త్రీనిధి రుణాలను మార్చి నెలాఖరులోగా రికవరీ చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం డీఆర్‌డీవో దత్తారావుతో కలిసి ఏపీఎంసీ, సీసీలు, మెప్మా సిబ్బందితో స్త్రీనిధి రుణాల రికవరీ, నూతన రుణాల జారీ, ప్రమాద బీమా, బ్యాంకు లింకేజీ అంశాలపై సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీనిధి కింద తీసుకున్న రుణాలు, ఓవర్ డ్యూస్ రికవరీ వందశాతం పూర్తి చేసేవిధంగా అధికారులు మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. అధిక బకాయిలు ఉన్న సభ్యులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. వందశాతం రుణాలు చెల్లించిన సంఘాలకు నూతన రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రతిఒక్కరూ ప్రమాద బీమాకు ప్రీమియం చెల్లించేలా అవగాహన కల్పించడంతోపాటు వందశాతం బ్యాంకు లింకేజీ పూర్తి చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండలాల వారీగా సమీక్షించారు. అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, మెప్మా ప్రాజెక్టు అధికారి మోతీరాం, స్త్రీనిధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో బుధవారం హైదరాబాద్ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఈసీజీ, షుగర్, బీపీ, పల్స్‌రేట్, 2డీ ఏకో తదితర వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఆరోగ్యమే మహా భాగ్యమని, ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవ చేసే పోలీసులు ఆరోగ్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ కరుణాకర్, సీఐ రాణాప్రతాప్, ఆర్‌ఐ పెద్దన్న, సీఐ రవీందర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సిబ్బంది శంకర్‌రెడ్డి, విజయ్, సీనియర్ ఆర్థో సర్జన్ విశ్వనాథ్, కార్డియాలజిస్ట్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పోటీలు



పోటీలు పరిశీలిస్తున్న డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్: ఉమ్మడి జిల్లా గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడాపాఠశాలలో బుధవారం ఎంపిక పోటీలు నిర్వహించినట్లు డీటీడీవో రమాదేవి తెలిపారు. ఐదో తరగతిలో 40 సీట్లకు 60 మంది, 6 నుంచి 9వ తరగతి వరకు బ్యాక్ లాగ్ సీట్లు కోసం 80 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన 40 మంది బాలికలను ఎంపిక చేస్తామన్నారు. అనంతరం తిర్యాణి గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న పీడీ లక్ష్మణ్ ఇటీవల బాడీబిల్డింగ్ పోటీల్లో మిస్టర్ ఆదిలాబాద్ టైటిల్‌ని సొంతం చేసుకోవడంతో డీఎస్‌వో మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, డీటీడీవో రమాదేవి శాలువాతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, పీడీలు పీఈటీలు మధుసూదన్, సంగీత, వెంకటేశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కిడ్నీలు జర పదిలం..!

- పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు
- జిల్లాలో వందమందికి పైగా పేషెంట్లు
- రెండు డయాలసిస్ కేంద్రాల్లో బాధితులకు సేవలు
- నేడు వరల్డ్ కిడ్నీ డే



ఆసిఫాబాద్‌లోని డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్తులు(ఫైల్)

ఆసిఫాబాద్: మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైనవి కిడ్నీలు. అవి సక్రమంగా పనిచేస్తేనే శరీరం నుంచి వ్యర్థాలు బయటికి వెళ్లి ఆరోగ్యంగా ఉంటారు. కానీ మారిన ఆహారపు అలవాట్లు, వివిధ అనారోగ్య సమస్యలతో కొంతమంది మూత్రపిండాలు చిన్నవయస్సులోనే దెబ్బతింటున్నాయి. గతంతో పోలిస్తే జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం. గురువారం వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా కథనం.

వందమంది బాధితులు

డీహైడ్రేషన్, పెయిన్ కిల్లర్లు అధికంగా వినియోగించడం, ఇన్ఫెక్షన్లు, బీపీ, షుగర్, ఆటోఇమ్యున్ వ్యాధితో పాటు జన్యుపరమైన సమస్యలతో మూత్రపిండాల పనితీరు దెబ్బతింటుంది. శాశ్వత కిడ్నీ ఫెయిల్యూర్‌ను దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి అంటారు. కిడ్నీలు 80 శాతం వరకు పాడయ్యే వరకు పనిచేస్తాయి. ఇందులో ఐదు దశలు ఉండగా, చివరి దశకు చేరితే మూత్రపిండాలు పూర్తిగా దెబ్బతిన్నట్లు భావిస్తారు. జిల్లావ్యాప్తంగా ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లలో వంద మందికి పైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. బాధితులకు సేవలందించేందుకు జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్‌లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో ఐదు డయాలసిస్ మిషన్లు ఉన్నాయి. ఆసిఫాబాద్‌లో 40 మంది, కాగజ్‌నగర్‌లో 40 మందికి ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నారు.

స్లాట్ దొరక్కపోతే ఇతర ప్రాంతాలకు..

కొంతమంది వ్యాధిగ్రస్తులకు స్లాట్ బుకింగ్ దొరక్కపోవడంతో మంచిర్యాల, కరీంనగర్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఆర్థిక స్తోమత ఉన్న కొంతమంది మంది హైదరాబాద్‌లోనే ఉంటూ చికిత్స పొందుతున్నారు. ఒక్కోసారి డయాలసిస్ కోసం రూ.6 వేలు వెచ్చించాల్సి వస్తుంది. వారానికి రెండుసార్ల చొప్పున నెలకు ఎనిమిది సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉటుంది. ఇందుకు నెలకు సుమారు రూ.50 వేలు ఖర్చవుతుంది. బతుకుపై ఆశతో తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు ఆస్తులు అమ్ముకుని చికిత్స చేయించుకుంటున్నారు. కిడ్నీ సమస్య ముదిరితే అకస్మాత్తుగా గుండె ఆగిపోవడం కూడా జరుగుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌కు చెందిన ఓ బాధితుడు మృతి చెందాడు.

జాగ్రత్తలు పాటించాలి

- హైబీపీ, డయాబెటీస్, కుటుంబంలో ఎవరికైన కిడ్నీవ్యాధిగ్రస్తులు ఉంటే తరచూ కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.
- కిడ్నీ సంబంధిత వ్యాధులకు గురైతే తరచుగా మూత్రానికి వెళ్లాల్సి వస్తుంది. అవసరం లేకున్నా ఒత్తిడిగా అనిపించడం, ఎలాంటి కారణం లేకుండా బరువు తగ్గడం వ్యాధికి సంకేతంగా భావించాలి.
- షుగర్ వ్యాధితో బాధపడేవారిలో 40 శాతం మంది దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది.
- మూత్రంలో ప్రోటీన్లు పోవడం క్లిష్టమైన అంశం. మూత్ర పరీక్షల ద్వారానే గుర్తిస్తారు. అనుమానం ఉన్నవారు తరచూ పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.
- మూత్రంలో రక్తం వస్తుంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

సేవలు మెరుగు



కిడ్నీ వ్యాధితో డయాలసిస్ చికిత్స చేయించుకుంటున్నా. గతంలో స్థానికంగా డయాలసిస్ కేంద్రం లేక మంచిర్యాలకు వెళ్లేవాళ్లం. రెండేళ్లుగా స్థానికంగా చికిత్స అందుతుండడంతో ఆర్థికంగా ఉపశమనం లభించింది. జిల్లాలోని డయాలసిస్ కేంద్రాల్లో మిషన్ల సంఖ్య, టెక్నీషియన్ల సంఖ్య పెంచాలి. కొంతమందికి స్లాట్ బుకింగ్ దొరకడం లేదు.

– ఇస్లాంబిన్ హసన్, ఆసిఫాబాద్

కొత్త భవనంలోకి డయాలసిస్ కేంద్రం



జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రాన్ని ఇటీవల కొత్త భవనంలోకి మార్చాం. పేషెంట్లకు మెరుగైన సేవలందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం కేంద్రంలో ఐదు డయాలసిస్ యూనిట్లు ఉన్నాయి. వాటి సంఖ్య పెంచేందుకు ప్రతిపాదనలు పంపించాం.

– డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డీసీహెచ్, ఆసిఫాబాద్

పెయిన్ కిల్లర్లు వాడొద్దు



అవగాహన లేకపోవడంతోనే ఎక్కువ మంది కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారు. పెయిన్ కిల్లర్ మాత్రలు అధికంగా వాడొద్దు. వ్యాధిగ్రస్తులు ఆస్పత్రిలో చికిత్స పొందాలి.. పసరు మందులు వాడకూడదు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ కేంద్రాల్లో 80 మందికి డయాలసిస్ సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ డీవీఎస్‌ఆర్ ప్రసాద్, ఆర్‌ఎంవో, దయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జి

క్లుప్తంగా

లారీలను అడ్డుకున్న యువకులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీలను అక్రమంగా అడ్డగించి డ్రైవర్లను వేధింపులకు గురిచేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు జైనథ్ ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన పద్మవార్ రాకేష్, సచిన్, కార్తీక్, సాత్విక్ మంగళవారం రాత్రి జైనథ్ మండలం భోరజ్ చెక్‌పోస్టు వద్ద లారీలు ఆపుతుండగా విషయం తెలుసుకున్న జైనథ్ పోలీసులు అక్కడికి వెళ్లారు. ఎలాంటి అధికారం లేకుండా ఎద్దుల లారీలను అక్రమంగా అడ్డుకుని డ్రైవర్లు సందీప్ గోకులే, షేక్ సాహిల్‌ను బెదిరిస్తుండడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు.

మద్యం పట్టివేత

వాంకిడి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను బుధవారం పట్టుకున్నట్లు ఎక్సైజ్‌శాఖ ఇన్‌చార్జి సీఐ రమేశ్ తెలిపారు. వాంకిడి మండలంలోని గోయేగాం గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి గడ్చిరోలి జిల్లాలోని సిరోంచకు వెళ్తున్న బస్సును తనిఖీ చేయగా 90 ఎంఎల్ దేశీదారు బాటిళ్లు 1010, 2 లీటర్ల రాయల్‌స్టాగ్ బాటిళ్లు 11, 2 లీటర్ల ఐబీ బాటిల్ 1, ఆఫీసర్స్ చాయిస్ బాటిల్ 1 లభ్యమయ్యాయి. వాటి విలువ రూ.58,970 ఉంటుందన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని తరలిస్తున్న తిరుమల బానయ్య, జ్యోతి దినేష్ కుంబారే, సుమలత, కిష్టయ్యపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్‌శాఖ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు ధన్‌రాజ్, రజిత పాల్గొన్నారు.

హెచ్‌ఎం అరెస్ట్

భీమిని: మండలంలోని జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రేగుచెట్టు రమేశ్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. గత నెల 28న పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించినందుకు పోక్సో కేసు నమోదైంది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి బెల్లంపల్లి కోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరికి గాయాలు



ఎల్లయ్యను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

కడెం: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ సమీపంలో బుధవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు దస్తురాబాద్ మండలం మున్యాల్‌కు చెందిన ఇద్దరు యువకులు ఇంటర్ పరీక్షలు రాసేందుకు ద్విచక్ర వాహనంపై కడెం వస్తుండగా ఎస్‌బీఐ బ్యాంక్ వైపు నుంచి బైక్‌పై వస్తున్న ధర్మాజీపేట్ గ్రామానికి ఎల్లయ్య బైక్‌ను ఢీకొట్టారు. ఘటనలో ఎల్లయ్య కాలుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఖానాపూర్ ఆస్పత్రికి తరలించారు.

బావిలోపడి యువకుడు మృతి


కౌటాల: ప్రమాదవశాత్తు బావిలోపడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మొగడ్‌దగడ్‌కు చెందిన ఉర్వత్ దౌలత్ (26) కొంతకాలంగా మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. మంగళవారం మద్యం మత్తులో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. బుధవారం ఉదయం గ్రామ శివారులోని బావిలో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తల్లి నిర్మలబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సహజ హోలీ.. సంతోషాల కేళి

● ఇప్పటికీ మోదుగుపూల రంగులే వాడుతున్న ఆదివాసీలు ● రసాయనాలతో ముప్పు

అడవులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆదివాసీలు జరుపుకునే ప్రతీ పండుగకు ప్రత్యేక చరిత్ర ఉంటుంది. అందరిలా కాకుండా వారంతా ప్రత్యేకంగా వైవిధ్యంగా పండుగలు జరుపుకుంటారు. శుక్రవారం హోలీ పండుగను కూడా ప్రత్యేకంగా జరుపుకునేందుకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. హోలీ వేడుకల్లో ప్రత్యేకంగా మోదుగుపూలతో తయారు చేసిన రంగులతో రంగోలి ఆడడం ఆనవాయితీగా వస్తోంది. రేపు శుక్రవారం సంబరాలకు ఉమ్మడి జిల్లావాసులు సిద్ధమయ్యారు. వేడుకల్లో ఆరోగ్యానికి హాని కలిగించే రసాయన పూరిత రంగులు ఆరోగ్యానికి హానికరమని, సహజ సిద్ధమైన రంగులు వాడడం శ్రేయస్కరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

– కెరమెరి/నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌ఖిల్లా



పూలతో నిండుగా ఉన్న మోదుగు చెట్టు



పూలతో రంగులు తయారు చేస్తున్న ఆదివాసీలు

అనాదిగా వస్తున్న ఆచారం

ఆదివాసీలు ఆచార వ్యవహారాలకు పెద్దపీట వేస్తున్నారు. అనేక పండుగలను వైవిధ్యంగా జరుపుకుంటున్నప్పటికి ఈ హోలి పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. గతంలో బయట మార్కెట్లో ఎక్కడ కూడా అనుకున్న విధంగా రంగులు లభించేవి కాదు. అందుకు వీరంతా ప్రకృతి ప్రసాదించిన మోదుగు పూలనే రంగులకు వాడుకునేవారు. ఈ పూలు మార్చి నెలలో మాత్రమే ఉంటాయి.

రంగుల తయారీ ఇలా..

హోలీకి ఒక రోజు ముందు మోదుగ పూలను తీసుకువచ్చి నీటిలో నానబెడతారు. తెల్లవారుజామున రోట్లో వేసి రోకలితో దంచుతారు. లేదా గ్రైండింగ్ చేస్తారు. ఆతర్వాత నీటిలో కలిపి హోలీ ఆడుతారు.

సహజ రంగులైతే మేలు..

సహజ సిద్ధమైన రంగులు వాడితే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో వివిధ రకాలైన రంగులను తయారు చేసుకోవచ్చు. వీటితో ఎలాంటి హాని జరగదు. దానిమ్మ, టమాటతో ఎరుపు రంగు, మోదుగుపూలు, క్యారెట్‌తో ఆరెంజ్ రంగు, బీట్‌రూట్ ఊదారంగు, ఆకు కూరలతో ఆకుపచ్చ రంగు, పసుపు కొమ్ములతో పసుపు రంగు ఇలా సహజ సిద్ధమైన రంగులను తయారు చేసుకోవచ్చు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- చర్మానికి రంగులు పట్టుకోకుండా ముందస్తుగా ఆవాల నూనె, జెల్లీని రాసుకోవాలి.
- కళ్లకు అద్దాలు పెట్టుకుంటే రంగునీళ్లు కళ్లలో పడకుండా ఉంటాయి.
- హోలీ ఆడిన వెంటనే చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. లేదంటే చేతి గోర్ల నుంచి రంగులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంది.

రసాయన రంగులతో ప్రమాదం..

- రంగుల్లో పాదరసం, సిలికా, మైకా, సీసం, వంటి వివిధ రకాల రసాయనాలు కలుపుతారు. ఇవి చర్మానికి, కళ్లకు, శ్వాస సంబంధిత సమస్యలకు కారణమవుతాయని వైద్యులు చెబుతున్నారు.
- రంగుల పొడి చల్లినప్పుడు అవి గాలిలో కలిసిపోయి నోటిలోకి, శ్వాసనాళాల్లోకి వెళ్లి ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. గాలి పీల్చినప్పుడు ఈ రంగులు ఊపిరితిత్తుల్లోకి వెళ్లి అస్తమా, ఎలర్జీ ఏర్పడే అవకాశం ఉంటుంది.
- రసాయన రంగులతో శరీరం దురద, మంట, నొప్పి కలుగుతుంది. కళ్లలో రంగులు పడితే కంటి పొరలు దెబ్బతినే అవకాశం ఉంది.
- రంగులు నోట్లోకి వెళ్తే వాంతులు, విరోచనాలు అవుతాయి. కడుపునొప్పి వస్తుంది.
- నలుపురంగులో లెడ్ ఆక్సైడ్‌తో మూత్రపిండాల వైఫల్యాలకు దారితీస్తుంది.
- కృత్రిమ ఆకుపచ్చ రంగుతో కాపర్ సల్ఫేట్ కంటి దురద, వాపు వైఫల్యాలకు దారితీస్తుంది.
- వెండి రంగు అల్యూమినియం బ్రోమైడ్ క్యాన్సర్ కారకం.
- నీలి రంగు చర్మ సంబంధ వ్యాధులు, మెర్క్యూరీ సల్ఫేట్ (ఎరువు) క్యాన్సర్‌కు కారణమవుతుంది.
- పౌడర్లు, గులాల్, లెడ్, బ్రోమియం, నికెల్, మెర్క్యూరీ, కాపర్, జింక్, వినిడికి లోపం, ఎలర్జీ, ఆయాసం మొదలగు దుష్ఫలితాలకు దారితీస్తాయి.

తాతమ్మ నేర్పిన మార్గంలోనే...



నిర్మల్‌ఖిల్లా: మోదుగ పూలు ఆరోగ్యరీత్యా పలు సుగుణాలు కలిగి ఉన్నాయి. నేను చిన్నప్పుడు దుకాణాల్లో కొనుగోలు చేసిన రంగులను వినియోగించే సందర్భంలో మా తాతమ్మ వాటికి బదులుగా మోదుగు పూలను తెచ్చి నానబెట్టి ఉడికించిన తర్వాత చేసిన కాషాయవర్ణపు సహజ సిద్ధ రంగులను వినియోగించమని ప్రోత్సహించేది. అలా నాకు దీని తయారీ అలవాటైంది. ఇప్పటికీ నా పిల్లలకు ఇదే సంప్రదాయాన్ని నేర్పిస్తూ కొనసాగిస్తున్నా.

– నల్ల మన్మోహన్‌రెడ్డి, సేంద్రియ రైతు, చించోలి(బి), నిర్మల్

మార్పుకోసం కృషి



రసాయన రంగులు మానుకోవాలి. ప్రకృతిలో దొరికే పూలు, ఆకులతో తయారయ్యే రంగులను వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. తద్వారా పర్యావరణాన్ని కాపాడినట్టే. ఇదే విషయం మా పాఠశాల విద్యార్థులకు అర్థమయ్యేలా చెబుతున్నా. వారితో స్వయంగా సహజసిద్ధమైన రంగులు తయారు చేసే విధానం నేర్పిస్తున్నా.

– వీఎస్ శ్రీనివాస్, ఎంపీపీఎస్ వెంకటాపూర్, మామడ, నిర్మల్

రసాయన రంగులతో ముప్పు



రసాయన రంగులతో ఆరోగ్య సమస్యలు వస్తాయి. శరీరంలో మంట, దురద వస్తాయి. రంగుల నుంచి వచ్చే పొగ పీల్చుకోవడం ద్వారా ఊపిరితిత్తుల సమస్యలతో పాటు శ్వాస సంబంధిత వ్యాధుల ముప్పు ఉంటుంది.

– డాక్టర్ రత్నాకర్, ఫిజీషియన్, నిర్మల్

కృత్రిమ రసాయనాలతో ప్రమాదం



రంగులు ఏవైనా కళ్లల్లో పడకుండా జాగ్రత్త పడాలి. హానికర రసాయనాలతో కూడిన రంగులతో రెటినా దెబ్బతినే ప్రమాదం ఉంది. అల్సర్లు, పుండ్లు ఏర్పడి శాశ్వతంగా కంటి చూపు దెబ్బతినే అవకాశం ఉంది.

– సురేశ్, కంటి వైద్యనిపుణుడు, నిర్మల్

తాతాలకాలం నుంచి..



మోదుగ పూలతో రంగులు తయారు చేసుకుని చల్లుకోవడం తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న ఆచారం. ఇప్పటికీ మేము ఇదే ఆచారాన్ని పాటిస్తున్నాం. ఎన్ని రంగులు బయట నుంచి తీసుకవచ్చినా మోదుగు పూలతో తయారు చేసిన రంగులతో సరిపోవు.

– సెడ్మకి దుర్పతబాయి, మాజీ జెడ్పీటీసీ

పూర్వీకుల నుంచి..



ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి: మా చిన్నతనం నుంచి హోలి పండుగ వచ్చిందంటే ప్రకృతి ప్రసాదించిన మోదుగ పూలతోనే రంగులు ఆడుతాం.. తెల్లవారు జామున నిద్రలేచి అడవికి వెళ్లి పూలు తెచ్చి రంగులు తయారు చేస్తాం. మా పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం.

– పెందూర్ చందు, సమాక, ఇంద్రవెల్లి

రాబోయే తరానికి..



ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి: మార్కెట్లో లభించే రంగులు వాడితే అనేక రోగాలు వస్తాయని, అవి వాడవద్దని, అడవిలో లభించే మోదుగు పూలతో తయారు చేసిన రంగులనే వాడాలని మాపిల్లలకు నేర్పిస్తున్నాం. రాబోయే తరానికి కూడా నేర్పిస్తున్నాం.

– భీంరావు, సమాక, ఇంద్రవెల్లి

కుడుకలు ఇస్తే లెక్క

- నేడు పులారా.. రేపు దురాడి
- సంప్రదాయబద్ధంగా కాముడి దహనం
- డోలు, బాజాలతో తరలివెళ్లనున్న ఆదివాసీలు
- కామున్ని దహనం చేసిన చోటే రాత్రంతా బస



కుడుకలు అందిస్తున్న గ్రామస్తులు (ఫైల్)

కెరమెరి/ఇంద్రవెల్లి: ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయం ప్రకారం హోలీకి ముందురోజు గ్రామ పటేల్, దేవారికి గ్రామస్తులంతా కుడుకలు ఇస్తారు. ఇలా కుడుకలు ఇచ్చిన వారే గ్రామస్తులుగా పరిగణించబడుతారు. గ్రామంలో ఉండి కూడా కుడుకలు ఇవ్వని వారికి గ్రామంతో సంబంధం లేదని గుర్తిస్తారు. ఈ కార్యమంతా కాముని దహనం రోజు జరుగుతుంది. గురువారం సాయంత్రం జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో ఈ ఆచారం కొనసాగుతుంది. కుడుకలతో పాటు చక్కెర బిళ్లలు గ్రామ పటేల్, దేవారికి అందజేస్తారు. అనంతరం వాటిని లెక్కిస్తారు. వాటి ప్రకారం గ్రామంలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, వాటికి సమానంగా కుడుకలు, పేర్లు వచ్చాయో లేదో పరిశీలిస్తారు.

పులారా అలంకరణ

వెదురు కర్రలతో రెండు పులారాలను తయారు చేస్తారు. వాటికి ఐదుచోట్ల కుడుకలు, గారెలు, గోగుపూలు, చక్కెర బిళ్లలు, వంకాయ అమరుస్తారు. అనంతరం గ్రామ పొలిమేర వరకు డోలు, సన్నాయిలతో తరలివెళ్లి కాముని దహనం చేస్తారు. అనంతరం రెండు వెదుర్లకు వృద్ధుడు, వృద్ధురాలు అని నామం పెట్టి ఆ పులారాలను కడుతారు. కిందిభాగంలో మంట అంటిస్తారు. ఆ తర్వాత ఆ మంట పై నుంచి వరుసగా కొందరు దూకుతారు. అనంతరం గ్రామంలోని ప్రతీ కుటుంబం నుంచి రొట్టెలు, పప్పులు తీసుకువచ్చి కాముని దహనం వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. ఆతర్వాత సహపంక్తి భోజనం చేస్తారు. కాముడిని దహనం చేసిన చోటే రాత్రంతా బస చేస్తారు.

కేరింతలకూ..చరిత్ర!

హోలీ రోజు ప్రతీ గ్రామంలో రంగులు చల్లుకుంటారు. కానీ ఆదివాసీ గిరిజనుల మాత్రం అందుకు కొంత భిన్నంగా ఉంటారు. రంగులు చల్లుకోవడంతో పాటుగా డోలు వాయిస్తూ.. జాజిరి ..జాజిరి.. బోబోబోబో.. అంటూ కేరింతలు పెడతారు. రావణాసురునిపై శ్రీరాముడు బాణం విసిరినప్పుడు అది తప్పిపోవడంతో రావణ సైన్యం అలాగే కేరింతలు పెట్టిందని, రావణుడు మరణించాక ఆ ఆనందంలో రాముని సైన్యం ఇలా తిరిగి కేరింతలు పెడుతూ ఉత్సాహంగా జరుపుకుంటారు. దానికి ప్రతీకగా ఈ కేరింతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పటేళ్లు చెబుతున్నారు.

బూడిదకు అత్యంత ప్రాధాన్యం

కాముడి దహనం తర్వాత అట్టి బూడిదను ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ఇళ్ల ముఖద్వారాల వద్ద గీత వేస్తారు. అలా వేస్తే ఎలాంటి దుష్టశక్తులు తమ ఇళ్లకు రావని ఆదివాసీల నమ్మకం. అంతేకాకుండా దండారీ ఉత్సవాల్లో కాముడి బూడిదకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. గుస్సాడీ వేషధారణలో ఈ బూడిదను ఉపయోగిస్తారు.

అన్ని పండుగలకు భిన్నంగా..



అన్ని పండుగలకంటే హోలి, దురాడి చాలా భిన్నంగా జరుపుకుంటాం. అంతా ఒక్కటై కాముని పున్నమిని జరుపుకుంటాం. కుడుకల ఆచారం చాలా ముఖ్యం. గ్రామ పటేల్‌కు కుడుకలు ఇస్తేనే ఆ గ్రామంలో ఉన్నట్టు. లేదంటే లేనట్టే. కాముని దహనం తర్వాత అక్కడే బస చేస్తాం.

– దంటీరావు, గ్రామ పటేల్, చిన్న సాకడ

తాత, ముత్తాతల నుంచి..



మాతాత ముత్తాతల నుంచి వస్తున్న ఆచారమిది. అన్ని గ్రామాల్లోని ఆదివాసీలు ఈ పండుగలకు అతీతులే. ప్రతిఒక్కరూ ఈ ఆచారాన్ని పాటించాల్సిందే. కానీ హోలి, దురాడి కార్యక్రమాల్లో మహిళలు అంతగా పాల్గొనరు. ఎక్కువగా ఈ కార్యక్రమాలను పురుషులు మాత్రమే జరుపుకుంటారు.

– రాధాబాయి, చౌపన్‌గూడ

ఇద్దరిపై వరకట్న వేధింపుల కేసు

మంచిర్యాలక్రైం: పట్టణంలోని హమాలివాడకు చెందిన ముత్యాల (చిలువేరు) స్వాతికి కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన ముత్యాల రాంప్రసాద్‌తో 2011 మార్చి 24న వివాహం జరిగింది. రాంప్రసాద్ విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేస్తున్నాడు. వివాహ సమయంలో రూ.15 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు, సుమారు రెండు లక్షల విలువ గల సామగ్రి అందజేశారు. దంపతులకు పాప, బాబు జన్మించారు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. గతంలో పోలీస్ స్టేషన్ వరకు రావడంతో కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. అయినా రాంప్రసాద్, అతని సోదరి సరోజ అదనపు కట్నం కావాలని వేధించారు. అంతేకాకుండా రాంప్రసాద్ పలువురు మహిళలతో వివాహేతర సంబంధం పెట్టుకుని స్వాతిని తీవ్రంగా కొట్టాడు. స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంప్రసాద్, సరోజపై అదనపు కట్నం, వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్ కుమార్ తెలిపారు.

కొలువుల సాధనలో మేటి అశోక్

● చదివిన కళాశాలలోనే జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం



నియామకపత్రంతో అశోక్

కాసిపేట: కష్టపడి చదివి నాలుగు ఉద్యోగాలు సాధించడంతో పాటు తాను విద్యను అభ్యసించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే జేఎల్‌గా ఉద్యోగం సాధించాడు జిల్లాకు చెందిన పెద్ది అశోక్. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని కొండపూర్‌కు చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికుడు పెద్ది పెంటయ్య, మధునమ్మ దంపతుల కుమారుడు అశోక్ 2012లో ఫారెస్టు బంగ్లా వాచర్ పరీక్షలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొదటి ర్యాంకుతో ఉద్యోగం సాధించాడు. కొలువు చేస్తూనే 2016లో ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాలుగో ర్యాంకు సాధించాడు. 2024లో జరిగిన గురుకుల డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించి నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల వెలువడిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ పోస్టుల ఫలితాల్లో హిస్టరి సబ్జెక్టులో రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించి బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నాడు. తాను ఇంటర్ చదివిన కాసిపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జేఎల్‌గా పోస్టింగ్ ఆర్డర్ తీసుకున్నాడు. 1 నుంచి పదోతరగతి వరకు ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన అశోక్ ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కాసిపేటలో సీఈసీ, డిగ్రీ ప్రభుత్వ జూనియర్ కళాశాల మంచిర్యాలలో, పీజీ ఉస్మానియా యూనివర్సిటి ఆర్ట్స్ కాలేజీ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. కాగా పీజీ ఎంట్రెన్స్‌లో సైతం మూడవ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తాను ఈ విజయం సాధించినట్లు పేర్కొన్నాడు. ఉద్యోగాల సాధనలో పట్టుదలతో ముందుకు వెళ్లడంతోనే విజయం సాధించినట్లు తెలిపాడు. భవిష్యత్‌లో గ్రూప్1 సాధించడం లక్ష్యంగా ముందుకెళ్తానని, అందుకు ప్రిపరేషన్ ప్రారంభించనున్నట్లు అశోక్ పేర్కొన్నాడు.

డీసీపీ ఔదార్యం



గాయపడిన మహిళను ఆటోలో ఎక్కిస్తున్న డీసీపీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లిలో బుధవారం రాత్రి జరిగిన ప్రమాద ఘటనలో డీసీపీ స్పందించిన తీరుపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ లక్సెట్టిపేట నుంచి మంచిర్యాలకు వెళ్తుండగా వేంపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన డీసీపీ వెంటనే తన వాహనాన్ని ఆపి ఓ ఆటోలో మహిళను ఎక్కించి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. మానవతా దృక్పథం చాటిన డీసీపీని పలువురు అభినందిస్తున్నారు.

ఎన్‌సీడబ్ల్యూసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా రమేశ్



శెడంషెట్టి రమేశ్

భీమారం: నేషనల్ కాంగ్రెస్ వర్కర్స్ కమిటీ (ఎన్‌సీడబ్ల్యూసీ) ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా మంచిర్యాల జిల్లా భీమారం మండలంలోని కాజిపల్లి గ్రామానికి చెందిన శెడంషెట్టి రమేశ్‌ను నియమిస్తూ బుధవారం కమిటీ ప్రెసిడెంట్ గుర్విందర్ మెహతా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా రమేశ్ తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్/మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ పాసైన బీసీ అభ్యర్థులకు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పనకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ కల్పిస్తారన్నారు. డిగ్రీ పూర్తిచేసి 26 ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 12న స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి అందులో సాధించిన మార్కుల ఆధారంగా 30 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కలిసికట్టుగా ఆడితేనే విజయం

● హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

ఆదిలాబాద్: క్రీడాకారులు కలిసికట్టుగా పట్టుదలతో ఆడితేనే విజయం సాధ్యమని హాకీ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ ఫీల్డ్‌లో ఏర్పాటు చేసిన హాకీ ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ పురుషుల ఎంపిక పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికతో ఆడితే విజయం సులభం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమలోని ప్రతిభను కనబరుస్తూ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. నిరంతరం సాధన చేస్తూ క్రీడా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16 నుంచి 18 వరకు కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో జరిగే 8వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వారికి మేనేజర్‌గా డేవిడ్ రాజు, శిక్షకునిగా జే.రవీందర్ వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్, సీనియర్ ప్లేయర్ అతుల్, పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

కొడప జంగు, వెట్టి జాకు, వెట్టి భీమ్‌రావ్, పవార్ అమర్నాథ్, విజయ్‌రెడ్డి, సుదర్శన్, హాడ్సే గజానంద్, చౌహాన్ వంశీ, మెస్రం అజయ్, శేఖర్, సంగం గౌతమ్, రామ్‌కుమార్, కిరణ్ కుమార్, పెద్దివార్ శ్రీనివాస్, అశోక్, షేక్ మహమ్మద్, కొడప ప్రదీప్, ఆత్రం జగ్జీవన్ ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ఒకరు అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: గంజాయి తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని పిట్టల్‌వాడకు చెందిన వెంకట్ బుధవారం దస్నాపూర్ కాలనీ నుంచి పిట్టల్‌వాడకు స్కూటీపై గంజాయి తరలిస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు అతన్ని తనిఖీ చేయగా 176 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు పేర్కొన్నారు. గంజాయి విలువ రూ.4,400 ఉంటుందన్నారు. గంజాయితో పాటు స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.